

# సైకియాట్రిక్ కథలు

## అంతా నేనే, అన్నీ నేనే

విమలతో వివాహమయ్యేటప్పటికి జగన్నాథానికి చిన్న కిరాణా షాపు వుండేది. అతను నెమ్మదిగా వ్యాపారం అభివృద్ధి చేసుకున్నాడు. కిరాణా షాపు స్థానంలో సూపర్ మార్కెట్ వెలిసింది. ఆ సూపర్ మార్కెట్లో వచ్చిన లాభాలతో ఇంకొక సూపర్‌మార్కెట్ పెట్టాడు. క్రమేపీ నగరంలో పది సూపర్ మార్కెట్లకు అధిపతి అయ్యాడతను. ప్రతి సూపర్‌మార్కెట్లోనూ బియ్యం, పప్పులు, సబ్బులు వంటి కిరాణా సామాన్లే కాకుండా కూరగాయల సెక్షన్, పళ్ల సెక్షన్, మాంసం, చేపల సెక్షన్, బేకరీ ఉన్నాయి. ఆధునిక గృహిణికి వరప్రసాదం జగన్నాథం నడిపే సూపర్ మార్కెట్ల సముదాయం.

అయితే జగన్నాథం భార్య విమలకి మాత్రం అతనితో జీవితం వరంలా కన్పించలేదు. ప్రతి విషయంలోనూ జగన్నాథం తన మాటే నెగ్గి తీరాలనుకునేవాడు. పెళ్లయిన కొత్తలో విమల ఆ విషయం అంతగా పట్టించుకోలేదు. ఇల్లు దిద్దుకోవడంలో, పిల్లల్ని పెంచి పెద్ద చేయడంలో ఆమెకు సమయం గడిచిపోయేది. పిల్లలు పెద్దవాళ్లయ్యాక ఆమెకు పని తక్కువై కాలం గడవడం కష్టమైంది.

**ఇల్లు చేరాక జగన్నాథం విమలను నానా తిట్లూ తిట్టడం ప్రారంభించాడు. ఓర్చుకోలేని విమల "మీరిలాగే ఉంటే నేను మా పుట్టింటికి వెళ్లిపోతాను" అంది.**

ఆమె కంప్యూటర్ కోర్సులో చేరి చదువుకుంటానని భర్తని అడిగింది. జగన్నాథం ఒప్పుకోలేదు. తన భార్య గడప దాటి బయటకు వెళ్లడం అతనికి ఇష్టం లేదు. వీధిలోకి వెళ్లడం ప్రారంభిస్తే ఆమె తన మాట వినదని అతని అభిప్రాయం. విమల మధ్యాహ్నం పూట వుండే పార్ట్‌టైం కోర్సులో చేరుతాననీ, ఇంట్లో పనికి ఏ విధమైన లోటూ రానివ్వనని నచ్చచెప్పింది. ఆమె చాలాసార్లు అడిగాక జగన్నాథం అతి కష్టంమీద ఒప్పుకున్నాడు. విమల కోర్సులో చేరింది. రెండు నెలలకే జగన్నాథం ఆమెచేత కోర్సు మాన్పించేశాడు. కారణం అడిగిన విమలకి ''ఏవైనా ముఖ్యమైన ఫోన్‌కాల్స్ నువ్వు ఇంట్లో లేనప్పుడు రావచ్చు కదా?'' అన్నాడు.

విమల ఇంట్లోనే ఉండి చదువుకుంటానని చెప్పి కరస్పాండెన్స్ కోర్సులో చేరింది. జగన్నాథం ఆమెను చదువుకోనివ్వలేదు. విమల చాలా బాధ పడింది. భర్త ఎప్పుడూ ఇంతే. తను ఒక్కర్తే స్నేహితుల ఇళ్ళకి వెళ్లడానికి ఒప్పుకునే వాడు కాదు. తనకిష్టంలేని పార్టీలకీ, మీటింగులకి తీసుకెళ్లేవాడు. విమలలో అసంతృప్తి పెరిగి ఇంట్లో గొడవలు ఎక్కువయ్యాయి. కోపం వచ్చినప్పుడు జగన్నాథం చేతిలో ఏదుంటే అది విసిరేసేవాడు. ఇంట్లో పరిస్థితి దుర్భరమైపోయింది. చివరకు ఒక రోజు దుర్భర పరిస్థితి పరాకాష్టకు చేరుకుంది. ఆ రోజేమైందంటే...

విమల, జగన్నాథం తెలిసినవారి ఇంట్లో పెళ్లికి వెళ్లారు. విమల ఇంటి నుండి వెళ్లింది. జగన్నాథం సూపర్‌మార్కెట్ నుంచి కళ్యాణ మంటపానికి వచ్చాడు. పెళ్లిలో ఆడవాళ్ల మధ్య కూర్చుని మాట్లాడుతున్న విమలని పిలిచాడు. విమల భర్త దగ్గరకు వెళ్లింది.

''విమలా! ఏమిటంత లోనెక్ జాకెట్ వేసుకున్నావ్? ఇంటికెళ్లి వేరే జాకెట్ వేసుకురా''

''ఇప్పుడు వెడితే ఏం బావుంటుందండీ? ఈ చీరకు ఇంకో మాచింగ్ బ్లౌజ్ లేదుకూడా''

''మాచింగ్ అంత ముఖ్యంకాదు. ఇంటికెళ్లి మార్చుకురా''

''ఇప్పుడు వెళితే బాగుండదు. నేను వెళ్లను''

''వెడతావా లేదా?'' జగన్నాథం గట్టిగా అరిచాడు. పెళ్లిపందిట్లో అందరూ తలతిప్పి జగన్నాథం వైపు చూశారు.

విమల సిగ్గుతో చచ్చిపోయింది.

''నెమ్మదిగా మాట్లాడండి. ఇప్పుడు ఇంటికి వెళ్లడానికి ఏం కారణం చెప్పను? ఈ జాకెట్ అంత అసభ్యంలేదు. అంతగా మీకు అభ్యంతరమైతే కొంగు కప్పుకుంటాను''

జగన్నాథం రెచ్చిపోయాడు.

''మాటకు మాట చెప్పడం బాగా నేర్చుకున్నావు. నీలాంటివాళ్లకు మాటలతో లాభంలేదు'' అంటూ ఆమె చెయ్యి పట్టుకుని బరబరా బయటకు ఈడ్చుకెళ్లి కార్లో పడేసాడు. పెళ్లికి వచ్చినవారంతా ఈ సంఘటన చూసి కదలకుండా ఉండిపోయారు.

ఇల్లు చేరాక జగన్నాథం విమలను నానా తిట్లూ తిట్టడం ప్రారంభించాడు. ఓర్చుకోలేని విమల ''మీరిలాగే ఉంటే నేను మా పుట్టింటికి వెళ్లిపోతాను'' అంది.

జగన్నాథం పిచ్చివాడయిపోయి బాత్రూంలోకి వెళ్లి తలుపులు బిడాయించుకున్నాడు.

''ఇదిగో నేనీ స్విచ్‌లో చెయ్యి పెడతాను. షాకు కొట్టి చస్తాను. అప్పుడు వెధవముండవయి పుట్టింటికి పోదువుగాని'' అని అరిచాడు.

విమల ఏడుస్తూ బాత్రూం తలుపు తియ్యమని వేడుకుంది. జగన్నాథం అరుపులు మానలేదు. చివరకు విమల ముందు జాగ్రత్త చర్యగా కరెంట్ ఆపేసింది. తన అన్నకి ఫోన్‌చేసి రప్పించింది. కొంతసేపటికి జగన్నాథం బాత్రూం తలుపు తీసుకుని బయటకు వచ్చాడు. భార్య, బావమరిది బలవంతం చేస్తే సైకియాట్రిస్టుని చూడ్డానికి ఒప్పుకున్నాడు.

సైకియాట్రిస్టు విమల చెప్పిన సంగతులూ, జగన్నాథం చెప్పిన విషయాలూ మొత్తం విన్నాడు. పిల్లలు పెద్దవాళ్లయ్యాక భార్య వ్యాపకాలు పెంచుకోవడం వల్ల ఇంట్లో కొన్ని స్పర్థలు ఏర్పడడం సహజమే. కానీ ఇది మామూలు వైవాహిక సమస్యకాదు. జగన్నాథంలో తన మాట తప్ప ఇంకేమీ నెగ్గకూడదన్న భావం బలంగా ఉంది. తన గురించి తప్ప ఇంకెవరి గురించీ ఆలోచించని తత్వమతనిది. భార్య కసలు వ్యక్తిత్వమే ఉండకూడదనీ, ఆమె వేసుకునే బట్టలు కూడా తన ఇష్టమేననీ నమ్ముతాడతను. తన మాట నెగ్గనప్పుడు బాత్రూంలో తలుపు వేసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడంటే అతనికి ఎవరితోనూ సర్దుకుపోవడం రాదన్నమాట. జగన్నాథంది నార్సిస్సిస్టిక్ పెర్సనాలిటీ డిసార్డర్ అయి వుండవచ్చని సైకియాట్రిస్ట్ అనుకున్నాడు.

విమల సైకియాట్రిస్ట్‌ని ''మీరు చెప్పిన నార్సిస్సిస్టిక్ పెర్సనాలిటీ డిసార్డర్ ఈమధ్యనే వచ్చి వుంటుందా?'' అని అడిగింది.

''లేదు. ముందునుంచీ మీవారి పెర్సనాలిటీ ఇలాగే వుంటుంది. అయితే మీరు ఇదివరకు గృహ నిర్వహణకీ, పిల్లల పెంపకానికీ అంకితమైనంతవరకూ ఆయనకు ఏ బాధాలేదు. మీరు మీ అభివృద్ధిని కోరుకున్నప్పటి నుంచీ కష్టాలు'' అన్నాడు సైకియాట్రిస్టు.

విమల నిజమే అనుకుంది.

కొంతకాలం జగన్నాథానికి బిహేవియర్ థెరపీ, ఇద్దరికీ మారిటల్ థెరపీ జరిగితే పరిస్థితి బాగుపడుతుందని డాక్టర్ చెప్పాడు.

విమలలో ఆశాకిరణాలు ఉదయించాయి.

**-పాలంకి సత్య** ★